# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# 'మనస్ఫీ'

" అదిగో! ఇదేదో హిందీ కొత్త సినిమాట, దాంట్లో పాట వస్తోంది వినండి. సెల్ఫీ! సెల్ఫీ ! అంటూ, మీరేమో ఒక్క సెల్ఫీ కూడా తియ్యరు మనకి, ఎన్నాళ్ళనించీ అడుగుతున్నాను?" అనంతంగా సాగుతున్న భార్య వాక్ప్రవాహానికి అడ్డు కట్ట వేస్తూ..

" బాగానే ఉంది రాధా, ఈ పిచ్చి పాటలు చూడొద్దంటే వినవు కదా! నీకెవరు చెప్పారో కానీ, ఈ సెల్ఫీలూ అవీ ఉత్త పిల్ల చేష్టలు. అడ్డూ అదుపూ లేకుండా వస్తున్న ఈ ఎలక్ట్రానిక్ ఉపకరణాలూ, ఇంటర్నెట్ లో పోతున్న వెర్రి పోకడలతో ఎక్కుతున్న వేలంవెర్రి. తెల్లారి పదిగంటలయింది. నా ముఖాన ఓ కప్పు కాఫీ పోస్తావూ?" అన్నారు మాధవయ్య గారు విసుక్కుంటూ.

" తెల్లారి పదిగంటలవలేదు, పొద్దున్నే ఆరింటికి సూర్యోదయమైందనుకున్నా, ఇప్పుడు పది అయింది కనక నాలుగ్గంటలే అయింది. లెఖ్ఖల మేస్టారు చెల్లెల్ని, నాకు తప్పుడు లెఖ్ఖలు చెప్పకండి. ఓ పట్టాన తెమిలారా కాఫీ ఇవ్వడానికి? " అందావిడ రుసరుసగా.

"అబ్బా! కొట్టింది దెబ్బ! " అనుకుంటూ పైకి మాత్రం " సరేలే, నీకీ మాత్రం లెఖ్ఖలు వచ్చాయి అంటే, మీ అన్నగారి వల్ల కాదు, ఈ లెఖ్ఖల మేస్టారి సాంగత్యం వల్లనే అని తెలుసుకో, కాఫీ ఇవ్వు" అన్నాడు మాధవయ్య గారు.

"రోజూ పొద్దున్నే లేచి పెద్ద గ్లాసుడు కాఫీ తాగడం బాగా తెలుసు కానీ పెళ్ళాం ముచ్చట తీర్చాలని తెలీదు" అంటూ ఆయన చేతిలో వేడిగా పొగలు కక్కుతున్న కాఫీ గ్లాస్ పెట్టి గిరుక్కున వెనుతిరిగిందావిడ. చురుక్కుమన్న చేతినీ, వేడిగా ఉన్న కాఫీని ఊదుకుంటూ మెల్లగా తాగసాగారు ఆయన.

ఇద్దరిదీ చెరో దారీ, చెరో రీతిగా ఉంటూనే కలకాలం కలిసుండే దంపతుల జాబితా అంటూ ఏదైనా ఒకటి తయారుచేస్తే అందులో మొదటిపేరు మాధవయ్యగారూ, రాధమ్మలదే అవుతుందదనడంలో సందేహం ఉండదు. మాధవయ్యగారు లెఖ్ఖల మేస్టారిగా పనిచేసి రిటైరయ్యారు. కొడుకులిద్దరూ అమెరికాలో ఉంటారు. రిటైర్ అయ్యాకా అమలాపురానికి దగ్గర్లో ఉన్న తమ స్వంత ఊరిలో స్థిరపడ్డారు, సిటీ జీవితానికి అలవాటు పడిపోయిన రాధమ్మ వద్దన్నా సరే వినలేదు.

" సర్లెండి! ఇన్నేళ్ళ కాపురంలో నా ముచ్చట ఏది తీరింది కనక?" అని ముక్కు ఎగబీలుస్తూనే ఆవిడ సామాన్లు సర్దింది పాపం. పైగా " ఏ హైదరాబాదో అయితే పిల్లలకి రావడానికి సౌకర్యంగా ఉంటుంది, ఈ మారుమూల అడవిలో ఏముందని వస్తారు? ఎలా వస్తారు? కనీసం రైలైనా లేదు" అనేది ఆవిడ. " రావాలన్న మనసుండాలే గానీ ఎక్కడికైనా రావచ్చు, ఏదైనా చెయ్యచ్చు. ఏ రెండేళ్ళకో వచ్చే వాళ్ళకోసం అంత ఆలోచన ఎందుకు? " అనేవారు ఆయన.

" సర్లెండి, మనిద్దరి అభిప్రాయం ఎప్పుడైనా కలిసిందా? ఎప్పుడూ నేనన్నది కాదనడమేగా మీకు తెలిసినదీ" అంటూ దీర్ఘాలు తీసిందావిడ.

ఆవిడకు విపరీతమైన దైవ భక్తి, ప్రతీ రోజూ పొద్దున్నే స్నానం చేసి, మడి కట్టుకుని పూజ చేస్తే తప్ప ఆవిడ కాఫీ పెట్టదు, ఎవరికీ ఇవ్వదు. ప్రతీ రోజూ, ఏదో ఒక వారం పేరున ఒంటిపూట భోజనమో, లేదా పూర్తి ఉపవాసమో చేస్తూనే ఉంటుంది. ఆయన దీనికి పూర్తిగా వ్యతిరేకం. "మానవ సేవే మాధవ సేవ" అని మనస్ఫూర్తిగా నమ్మే అతను ఎప్పుడూ ఆ దిశలోనే ఆలోచిస్తూ, సహాయ కార్యక్రమాలు చేస్తూ ఉంటారు.

" అమ్మగారూ, నాన్నగారూ" అంటూ వచ్చింది శాంతి చేతిలో స్వీట్ పాకెట్ తోఆయన కాఫీ తాగుతూ ఉండగానే.

"రామ్మా శాంతీ ఏమిటీ విషయం?" అనడిగారు మాధవయ్య ఆనందంతో వెలిగిపోతున్న శాంతి ముఖం చూసి.

" వచ్చావా శాంతీ, దా,! కాఫీ తాగుతావా? అని అడిగింది రాధమ్మ కూడా. " వద్దమ్మా, ముందు మీరు నోరు తెరవండి " అంది శాంతి సంబరంగా, పేకెట్ లోని జిలేబీ చేతిలోకి తీసుకుంటూ..

" ఏమిట్రా అంత సంబరం? అన్నారు మాధవయ్యగారు. " శాంతమ్మ స్కూల్ ఫస్ట్ వచ్చిందట బాబూ!" అన్నాడు అప్పుడే అక్కడకు వచ్చిన గోపన్న, శాంతి తండ్రి.

" నాకు తెలుసు, శాంతి ఎప్పుడూ చక్కగా చదువుకునే పిల్లే, ఫస్ట్ రావడం పెద్ద విశేషమేమీ కాదు, ఉండు దిష్టి తీస్తాను " అంటూ లోపలకి పరిగెత్తింది రాధమ్మ.

" స్కూల్ కి ఒక్కటే కాదు నాన్నా! మన జిల్లాకి మొత్తం ఫస్ట్ అటండి" అంది శాంతి సంతోషంగా మాధవయ్యగారికి స్వీట్ ఇస్తూ.

" నీకు కాకపోతే మరెవరికి వస్తుందిట ఫస్ట్ మార్క్? వస్తే ఆశ్చర్యం లేదురా, రాకపోతే ఆశ్చర్య పోవాలి కానీ!!" అని మాధవయ్యగారు అంటూ ఉండగానే రెండు గుప్పిళ్ళతోనూ ఉప్పు తెచ్చి శాంతికి దిష్టి తీసింది రాధమ్మ.

-------------------------

మాధవయ్యా, రాధమ్మ ఈ పల్లెటూరికి మారిన కొత్తలో తమ స్వంత ఇంటికి దగ్గరలోనే ఉన్న తెలిసున్న వాళ్ళ ఇల్లు అద్దెకి తీసుకుని, తమ పాత ఇంటికి కావలసిన మార్పులూ, మరమ్మత్తులూ చేయించుకున్నారు. అప్పుడు పరిచయం అయ్యాడు మేస్త్రీ గోపన్న. నెమ్మదస్తుడు అనే కంటే మెతక మనిషి అనడం సబబేమో అతన్ని. ప్రసవవేదనలో బిడ్డని బయటకి తెచ్చి తాను తిరిగిరాని లోకాలకి వెళ్ళిపోయింది భార్య రత్తాలు. బాధని మరిచిపోవడానికంటూ మొదలుపెట్టిన తాగుడు తొందరలోనే అతన్ని తనకి దాసోహం అయ్యేలా చేసింది. ఇదేమీ కొత్త కధ కాదు, ఆ పల్లెటూళ్ళల్లో అనేక ఇళ్ళల్లో జరిగేదే. కేవలం కారణాలు మాత్రమే వేరు. వదిన పోయాకా, చంటిపిల్లని ఎంతో శ్రద్ధగా నాలుగేళ్ళపాటు చూసుకున్న గోపన్న చెల్లెలు లక్ష్మి పెళ్ళి చేసుకుని వెళుతూ ఆ పిల్లని తనతో తీసుకెళ్ళలేకా, ఆ చంటిదాన్ని వదిలి వెళ్ళలేకా కన్నీరు మున్నీరయ్యింది.

' చిన్నదాన్ని కళ్ళల్లో పెట్టుకుని చూసుకుటానని' అన్న దగ్గర మాట తీసుకుని ఎర్రబారిన కళ్ళతోనే బస్ ఎక్కింది లక్ష్మి.. 'శాంతి' అన్న పేరు కూడ లక్ష్మే పెట్టింది.

గోపన్న తాగనంతవరకూ బాగానే ఉండేవాడు. తాగి తూలుకుంటూ ఎక్కడో అక్కడ పడి, అక్కడే నిద్రపోయిన రోజు మాత్రం ఆ పసిదాన్ని చూసేవారుండేవారు కాదు. పక్కింటి వరాలమ్మే చూసి తన పిల్లలతో పాటే ఇంత అన్నం పెట్టి, తన కూతురు పక్కన పడుకోబెట్టేది.

" రేపు ఇంట్లో గచ్చు కి రాళ్ళు పరుస్తానమ్మా, మీరిద్దరూ ఒకసారి వచ్చి చూస్తే బావుంటది" అన్నాడు గోపన్నఒకరోజున.

మర్నాడు పొద్దున్నే పదకొండింటికి భోజనాలు కానిచ్చి వచ్చారు ఇద్దరూ, అప్పుడే వాళ్ళు మొదటిసారి శాంతిని చూడడం. తండ్రి వెనకే తిరుగుతూ, చిన్న చిన్న రాళ్ళూ, తాపీ అందిస్తున్న ఆ చిన్న పిల్లని చూడగానే మాధవయ్య గారి మనసు కలుక్కుమంది. సిటీల్లోని వందలాది అపార్ట్ మెంట్ ల ముందు " నో చైల్డ్ లేబర్" అని రాసిఉన్న బోర్డ్ లు కళ్ళ ముందు మెదిలి, తాము పెద్ద అపరాధం చేస్తున్నామన్న భావన ఆయన మనసంతా పరుచుకుని అతన్ని వ్యాకులపెట్టింది. ఆ పిల్ల చేతిలోంచి తాపీ లాగి పక్కన పడేసి దగ్గరకు తీసుకున్నారు. రాధమ్మ ఆశ్చర్యంగా చూసింది ఆయన వైపు.

"ఏమిటిది గోపన్నా! ఎవరీ అమ్మాయి? ఈ చిన్న పిల్లతో పని చేయిస్తున్నావా? ఇంతకంటే పనివాళ్ళెవరూ దొరకలేదా?" అన్నారు కోపంగా.

" అబ్బే, అదేం లేదయ్యగారూ! ఇది నా కూతురే. ఇంటిదగ్గర చూసుకునేవోళ్లెవరూ లేక ఇలా వెంట పెట్టుకొస్తాను. దానికి నావెనకే తిరగడం, ఆ పనీ, ఈ పనీ సెయ్యడం సరదా అండే" అన్నాడు గోపన్న నవ్వుతూ.

మాధవయ్యగారు నవ్వలేదు. " చాల్లే చెప్పావు, ఈ మట్టీ, ఇసకల్లో చిన్నపిల్లలు పనిచెయ్యవచ్చా? పైగా సరదాగా చేస్తుంది అంటున్నావా? నువ్వేం చూపిస్తే అదే చేస్తుంది, చిన్నపిల్ల దానికేం తెలుసు? ఇలా అయితే నువ్వేం పని చెయ్యక్కరలేదు, నేను ఇంకో మేస్త్రీ ని చూసుకుంటానులే" అన్నారు విసురుగా.

ఇందులో ఆయనకంత కోపం వచ్చేందుకేముందో? అర్ధం కాలేదు రాధమ్మకి. 'అతని కూతురు, అతని ఇష్టం ' అనుకుంది.

" అంతమాటనకండయ్యా, చెప్పాను కదయ్యా, ఇంట్లో ఎవరూ లేక నా ఎనకే వస్తది ఎప్పుడూ, వరాలమ్మంటే అప్పుడప్పుడూ తన పిల్లలతో పాటు తీసుకెళ్ళి రెండు ముద్దలు పెట్టి సూసుకుంటది" అన్నాడు గోపన్న ఈ సారి నవ్వలేదు అతను.

"''ఇంట్లో ఎవరూ లేకపోతే పనికి వస్తూ మా ఇంట్లో దింపి వెళ్ళు. వరాలమ్మ పెట్టే రెండు ముద్దలాపిల్లకి మీ అమ్మగారూ పెట్టగలదు, అంతే కాని ఇంకోసారి ఈ మట్టిలో పిల్ల కనిపిస్తే ఊరుకోను " అన్నారాయన గట్టిగా. " పిల్లలు పెద్దవాళ్ళయి సుఖంగా ఉంటున్న ఈ సమయంలో ఇది మనకవసరమా? ఈయనకి మతి పోలేదు కదా!" అనుకుంది మనసులో, పైకి మాత్రం భర్త మాటకెదురు చెప్పడం ఇష్టం లేక మౌనం వహించింది.

అలా మొదలైంది శాంతితో వారి అనుబంధం. గోపన్న పనికి వెళుతూ శాంతిని మాధవయ్యగారింట్లో విడిచి వెళ్ళేవాడు. ముద్దుగా, చందమామ లా ఉండేది ఆ ఏడేళ్ళ పిల్ల. ఆడపిల్లలంటే ఎంతో ఇష్టమైన మాధవయ్యగారికి శాంతి అంటే ఎంతో అభిమానం.

మొదట్లో " మనకెందుకొచ్చిన లంపటం!" అనుకున్నా కొన్నాళ్ళకి రాధమ్మకీ శాంతి అంటే అభిమానం పెరగసాగింది. మొదట్లో రాత్రి అన్నమో, మిగిలిన కూరో, ఆవకాయతో పెట్టే ఆవిడ, ఆరునెల్లు గడిచేసరికి " శాంతి కిష్టం సేమ్యా పాయసం" అని చేసిన పాయసం లోంచి ఒక కప్పు తీసి దాచడం,

ఆతర్వాత " శాంతి కిష్టమనే ఈ రోజు ఆవడలు చేశాను" అనడం దాకా వచ్చింది. పిల్లలు పెద్దవాళ్ళయిపోయిన ఆ ఇంట్లో శాంతి రాకతో మళ్ళీ చిన్న సరదాలూ, అల్లర్లూ, నవ్వులూ విరబూయడం మొదలుపెట్టాయి. పూలమొక్కలకీ, పసిపిల్లలకీ స్పందించని వారు దాదాపుగా అరుదు. రాధమ్మ దానికేమీ మినహాయింపు కాదు.

ఎప్పుడో వాళ్ళ అత్త లక్ష్మి తెచ్చిన కాలి పట్టాలు ఘల్లు ఘల్లు మంటూ ఉంటే సందడిగా తిరిగేది. ఊరికే కూర్చోకుండా అమ్మగారికి పూజకి పూలు కొయ్యడం, లేదా ఆవిడకి ఇంటిపని చేసే గౌరమ్మ చేతిలోంచి చీపురు లాక్కుని " నేను తుడుస్తాలే అవ్వా ' అంటూ వీధి మెట్లూ అవి తుడవడం ఇలాంటివి చేసేది.

" ఏమండి, శాంతిని చూశారా? ఇవ్వాళ వడియాలు పెడతానన్నానో, లేదో, మేడంతా గౌరమ్మ కంటే ముందే తుడిచి, కడిగేసింది" అనో, " రేపటినించి ముగ్గు నేను వేస్తానమ్మా అంటోందండోయ్" అనో ఇలా ఏదో ఒకటి చెప్పేదాకా మాధవయ్యగారికి స్ఫురించలేదు ఆ విషయం. వెంటనే గోపన్నని పిలిచి ' శాంతిని స్కూల్లో చేర్చాలి' అన్న విషయం చెప్పారు.

" మా లాంటి వారికి చదువులెందుకయ్యా? ఇంకో నాలుగైదేళ్ళు ఇలాగే గడిచిపోతే, ఎవడో ఒకడిని చూసి ముడెట్టేస్తే దాని బతుకు అదే బతుకుద్ది కదా! ఈ ఆడపిల్లల్ని పెంచి పెళ్ళిళ్ళు చెయ్యడమే పెద్ద పని, పైగా చదువులంటే " అని నసిగిన గోపన్నని మధ్యలోనే ఆపి..

" బతకదు! పొట్ట కొస్తే అక్షరమ్ముక్క రాకుండా ఎలా బతుకుతుంది? నిండా ఏడేళ్ళు లేని పిల్ల పెళ్ళి వయసుకు రావాలంటే నాలుగేళ్ళు కాదు, కనీసం పధ్నాలుగేళ్ళు కావాలి, అప్పటివరకూ ఇలా అంటగిన్నెలు కడిగి, డాబాలు తుడిచీ జీవితాన్ని వృధా చేస్తూ ఆతర్వాత బాధపడి ప్రయోజనం లేదు. భగవంతుడు మనిషికిచ్చిన వరం బాల్యం, దాన్ని ఇలా బండపనులకి బలిచేయడం దారుణం, నేరం. 'శాంతమ్మ ని స్కూల్లో నేను చేరుస్తాను' అని నీకు చెప్పడానికే పిలిచాను. ఇంక వెళ్ళిరా!" అన్నారు ఆయన.

వేసవి సెలవులు రెండు నెలలూ కావలసిన తర్ఫీదు ఇచ్చి ఆ ఊరిలోనే ఉన్న చిన్న బడిలో రెండో క్లాస్ లో చేర్చారు శాంతిని. కావలసిన బట్టలు కుట్టించింది రాధమ్మ. పొద్దున్నే శాంతిని స్కూల్ కి తయారుచేసేది గౌరమ్మ. అమ్మగారు పెట్టిన చద్దన్నమో, టిఫినో తిని స్కూల్ కి వెళ్లేది శాంతి. మధ్యాహ్నం వచ్చి వేడి అన్నం తిని ఇంట్లో చిన్న చిన్న పనులు వద్దన్నా సరే చేసి, తిరిగి మధ్యాహ్నం స్కూల్ కి వెళ్ళేది. సాయంత్రం వచ్చాకా మాధవయ్యగారి పర్యవేక్షణలో చదువుకునేది. రాత్రి అమ్మగారు పెట్టేసిన అన్నం తినేసి ఇంటికి వెళ్ళిపోయేది మొదట్లో. తర్వాత్తరవాత గోపన్న పక్క ఊర్లలో తాపీ పనులూ అవీ ఒప్పుకోవలసి రావడంతో చాలా రోజులు ఇక్కడే ఉండిపోయేది. చదువులకని పొరుగూర్లల్లో ఉంటున్న మాధవయ్య గారి పిల్లలు వస్తే " అన్నయ్యా" అంటూ వెంటే తిరిగేది వాళ్ళున్న నాలుగు రోజులూ. చక్కగా చదువుకునేది, ఆటపాటల్లో కూడా ముందుండేది.

" ఎంత చక్కటి పిల్లమ్మ గారూ! ఆ బగమంతుడు నాకైనా ఇంత సక్కని కూతుర్నివ్వలేదు, తల్లిని పట్టించుకోని మొగెదవల్నిచ్చాడు ముగ్గుర్ని" అనేది గౌరమ్మశాంతిని చూస్తూ.

" తనకీ అలాంటి కూతురుంటే బావుండునని' రాధమ్మకీ ఎన్నో సార్లు అనిపించేది. ఆ మాట మాధవయ్య గారితో అంటే ఆయన నవ్వేస్తూ " కంటేనే కూతురా ఏం? ఇప్పుడు మాత్రం అది మన పిల్లలతో సమానం కాదా భాగ్యం" అనేవారు. " నిజమే!" అనుకునేది ఆవిడ కూడా మనస్ఫూర్తిగా.

అలా పెరుగుతున్న శాంతి అవసరాలని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, కావలసినవన్నీ అమరుస్తూ తమ స్వంత బిడ్డలాగే పెంచారు ఆ దంపతులిద్దరూ ఆ పిల్లని. అలా తమ ఇంట పూసిన ఆ చిట్టి గులాబీ ఎంతో బాగా చదువుకుని ఈ రోజు జిల్లా స్థాయిలో ప్రథమురాలిగా వచ్చేసరికి వారి ఆనందం పట్టలేనంత గా ఉంది.

---------------------------------

" అలా కూర్చోవే బంగారం, ఇప్పుడే ఏదైనా తీపి తెస్తాను!" అంది రాధమ్మ మళ్ళీ వంటింటివైపు పరిగెడుతూ.

శాంతి నవ్వుతూ చూస్తోంది. "నన్నూ అమ్మా అంటావు కదా, ఆయన్ని అయ్యగారెందుకు? నాన్నగారూ అను" అని అమ్మ అన్నప్పుడు ఎంత సంబరపడిపోయిందో తను. ఏనాటి అనుబంధమో ఇది. లక్ష్మత్త ఎప్పుడూ అనే మాట 'నీకింత మంచి బతుకు ఆ దేవుడు కాదే శాంతి, మేస్టారూ, అమ్మగారే రాశారు, ఆళ్ళే మనకి దేవుళ్ళు" ఎంత నిజమో! అనుకుంది.

"శాంతమ్మా, తర్వాతేం చదువుదాం?" అన్నారు మాధవయ్యగారు. ఆయనెప్పుడూ 'శాంతమ్మా' అనే పిలుస్తారు, ఎప్పుడూ తనతో కలుపుకున్నట్టే మనం అనే మాట్లాడతారు. " శాంతమ్మా మనకేమిష్టం? రేపు మనకి స్కూలుందా? ఇలా.

" మీ ఇష్టం నాన్నగారూ. నాకైతే సైన్స్ అంటే ఇష్టం, లెక్కలన్నా ఇష్టమే అంది" చిలిపిగా నవ్వుతూ.

" ఈ లెక్కల మేస్టారికోసం అలా చెప్తున్నావా??" అన్నారు ఆమె తల మీద చిన్నగా తడుతూ.

ఇంతలో వచ్చింది రాధమ్మ మూడు కప్పుల నిండా గోధుమ రవ్వ ప్రసాదం పట్టుకుని. "ఇదిగో శాంతీ, ముందు తీపి తిను, తర్వాత మాట్లాడదాం !" అంటూ.

", ఇంతకంటే తీపి కబురు చెప్తాను నీకు. అర్జంట్ గా వెళ్ళి నీకిష్టమైన మంచి చీర కట్టుకురా! అన్నారు మాధవయ్యగారు ఉన్నట్టుండి.

" మీకన్నీ పరాచికాలే, ఇప్పుడు నేను మంచి చీర కట్టుకోవడం ఎందుకు? గుడికి దాన్ని రేపొద్దున్నే తీసుకెళ్దాం, మంచిరోజు ' అందావిడ.

" గుడికి కాదోయ్, భార్యామణీ! విషయం చెప్తాను కదా, త్వరగా చీర కట్టుకుని తయారయ్యి రా. పదేనిమిషాలు నీకు టైము, ఈలోపున మేము ఈ హల్వా సంగతి చూస్తాము" అన్నారాయన నవ్వుతూ. అయోమయంగా చూస్తూనే తనకీ, మేస్టారికీ ఇష్టమైన వంగపండు రంగు గద్వాలు చీర కట్టుకుని, జడ వేసుకుని, పూలు పెట్టుకుని వచ్చిందావిడ. అప్పుడు తీసారాయన తన లాల్చీ జేబులోంచి కొత్త ఫోన్.

" శాంతమ్మా, దా మనం ఫోటో తీసుకుందాం, మీ అమ్మగారిని కూడా రమ్మను, గోపన్న నువ్వు కూడా!"అన్నారు నవ్వుతూ. ఈమధ్యనే కొడుకు పంపిన స్మార్ట్ ఫోన్ అది, దానితో పాటు ఉచితంగా ఇచ్చిన సెల్ఫీ స్టిక్ కూడా ఉంది. ఆ కర్రకి ఫోన్ అమర్చి టైం సెట్ చేస్తూ మళ్ళీ పిలిచారు ఇద్దరినీ. నలుగురూ నించున్నాకా, వరసగా నాలుగైదు ఫోటోలు తీసారు.

" రాధా!ఇదన్నమాట నువ్వెప్పటినించో అడుగుతూ నా బుర్ర తినేస్తున్న సెల్ఫీ. రోజూ మనం కూడా ఒక సెల్ఫీ ఫోటో తీసుకుందాం అనేదానివి కదా! ఇప్పుడు తీసాను చూడు!" అంటూ చెప్పసాగారు ఆయన.

" హర్యానాలో జింద్ జిల్లాలోని ఒక చిన్న ఊర్లో తల్లితండ్రుల్ని ఆడపిల్లలతో సెల్ఫీ తీసుకుని ఫోటోలుపంపమని పోటీ పెట్టి, అందులో బాగున్న మూడు ఫోటోలకి బహుమతులు ప్రకటించారుట ఈ మధ్యన. అలా ఎందుకు చేశారో తెలుసా? ఆడపిల్లల్ని భారంగా భావించి పుట్టుకతోనే అంతం చేసి, భ్రూణహత్యలకు పాల్పడవద్దనీ, వారిని అబ్బాయిలతో సమానంగా అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించమనీ చెప్పడానికే. ఇప్పటికే మనదేశంలో అమ్మాయిల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. కనీసం ఇలాంటి ప్రయత్నాలవల్లైనా ప్రజలు కళ్ళుతెరిచి, అమ్మాయిలని అక్కరలేని బరువుగా భావించి, పుట్టుకతోనే సమాధి చేస్తున్న అమానుషానికి తెరపడుతుందేమోనన్న ఆశతో, అందమైన బ్రతుకునిచ్చి పెంచుతారనే ఉద్దేశ్యంతో.

దాన్ని చూసి స్ఫూర్తి పొందిన ప్రధానమంత్రి కూడా మీరు ' మీ అమ్మాయిలతో సెల్ఫీలు తీసుకొని, ప్రపంచానికందరికీ తెలిసేలా పంచండి' అని పిలుపునిచ్చారు. " ఆడపిల్లను పెంచండి, ఆమెను చదివించండి " అనే నినాదంతో. దానికి విపరీతమైన స్పందన వచ్చింది భాగ్యం. ఈ సెల్ఫీ అన్న మాట విన్నప్పటినించీ, మనం కూడా సెల్ఫీ తీసుకుందాం అంటూ నా ప్రాణం తీసేదానివి కదా! దీనిమీద సదభిప్రాయం లేక, నీ మాటలకెప్పుడూ పెద్దగా స్పందించలేదు. ఈ' సెల్ఫీ విత్ యువర్ డాటర్ ' అన్న ప్రచారాన్ని గురించి చదివిన తర్వాత మొదటిసారి సెల్ఫీ అనే ప్రక్రియ నాకు నచ్చింది. కానీ అది తీసుకునే అదృష్టం ఆడపిల్లలు లేని మనకి లేదు కదా ! అనుకున్నాను మొదట ఈ బంగారు తల్లిని మర్చిపోయి.

ఈ శాంతమ్మ మనకెంతో ప్రత్యేకం కదూ! మన ఇంటి పిల్లలా పెరిగిన ఈ చిన్నారి తల్లి మనకళ్ళ వెలుగై, ఒక్కరోజు విడిచి ఉండలేని పరిస్థితికి మనల్ని తెచ్చింది కదూ! అంతే కాదు, ఎంతో బాగా చదువుకుంటూ మనకెంత సంతోషాన్నిస్తోందో చూశావా? అందుకే మన ఈ కూతురితో ఒక ఫొటో తీసుకుని " సెల్ఫీ విత్ యువర్ డాటర్ ' ప్రచారంలో భాగం కావాలనిపించింది. ఈ కార్యక్రమానికి ఇంతకంటే సార్ధకత నిచ్చే ఫొటో ఉంటుందా చెప్పు! కోరి ముద్దుగా పెంచితే కోమలమైన తీగల్లా ఎదిగి ప్రేమాభిమానాల పూలు పంచే లతామతల్లులే కూతుళ్ళు. ఆటపాటలతోటీ, చదువు సంధ్యలతోటీ మురిపించే కళ్ళవెలుగులు అవుతారు, దానికి కనవలసిన అవసరమే లేదు" అని ప్రపంచానికంతా చెప్పాలని అనిపిస్తోంది రాధా. అందుకే ఈ సెల్ఫీ నువ్వు అడగకుండానే తీశాను. చెప్పు నీ సెల్ఫీ కోరిక తీరింది కదూ " అన్నారాయన భార్య వైపు ప్రేమగా చూస్తూ.. అందంగా నవ్విందావిడ. అంతలోనే ముఖం చిట్లించి "తీరిందంటే తీరింది, లేదంటే లేదు" అంది హఠాత్తుగా.

" మళ్ళీ అదేమిటి?" అన్నారాయన.

" అవును, ఇది సెల్ఫీ కాదు, మన మనసెరిగి మసలుకుంటూ, మన ముచ్చటలు తీర్చుతున్న ఈ బంగారు తల్లితో తీసుకున్న ఫొటో మన మనసుల్లో కలకాలం నిలిచి ఉండేది కనక దీనికి " మనస్ఫీ' అని కొత్త పేరు పెట్టాలి. అందువల్ల మీరు నాకు సెల్ఫీ ఇంకా బాకీ ఉన్నట్లే, లెఖ్ఖంటే లెఖ్ఖే! ఈ లెఖ్ఖల మేస్టారి ఇల్లాలిని బురిడీ కొట్టించలేరు" అంటూ లాజిక్ చెప్తున్న రాధమ్మని చూసి కిల కిలా నవ్వింది శాంతి.

Click here to share your comments on this story

●●●